# బుద్ధి


శ్రీమతి న్యాయపతి కమలారాంజీ

భవానీ షేర్ టాక్సీలో వెళుతూ యధాలాపంగా బయటకు తొంగి చూసింది. ఆమె దృష్టి స్పీడ్‌గా వెళుతున్న మోటరుసైకిల్‌పై పడింది.

ముఖర్జీ!

అతని వెనక ఎవరో అమ్మాయి!?

బ్లూ కలర్ చుడీదార్ వేసుకుంది ఆ అమ్మాయి!



ముఖర్జీ మోటర్ సైకిల్ మీద కూర్చుంటే మోటర్ సైకిల్‌కే అందం వస్తుంది! భవానికి కొత్త పాయింట్ ఒకటి దొరకిపోయింది. మనసులో ముల్లు గుచ్చు కున్న భావన. ఆ అమ్మాయి ప్లేస్‌లో తనుంటే!... గుండె గుబగుబలాడింది! తన కంత అదృష్టమా?! అంటే ముఖర్జీ అమ్మాయిలతో తిరుగుతున్నాడన్నమాట. ముఖర్జీ పక్కన మరో అమ్మాయిని వూహల్లో కూడా భరించలేదు భవాని!?

"ప్చ్. ఏం చేస్తాం?" అనుకుంది బాధగా.

రఫ్‌గా, మేన్లీగా వుండే ముఖర్జీకి ముప్పయి ఏళ్లొచ్చినా వాళ్లింట్లోవాళ్లు పెళ్లిచెయ్యకపోతే తను మాత్రం ఏం చేస్తాడు? వంట్లోని వేడి చల్లార్చు కోవాలి కదా మరి!

ముఖర్జీ పెళ్ళికి వాడి చెల్లి అడ్డుగా వుంది. ఆ అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారు. తనకయితేగాని ముఖర్జీకి పెళ్ళి కాదు. అందమైన పర్సనాలిటి, ఆరడగుల ఆజానుబాహువు, రాయల్‌గా మోడల్‌లా వుంటాడు ముఖర్జీ! అలాంటి మగాడి కోసం ఏ అమ్మాయి మాత్రం వల వెయ్యకుండా వుంటుంది! భవాని మనసు మూగగా రోదిస్తోంది. ముఖర్జీ అంటే తనెంత పడి ఛస్తుందీ, ఎంత పిచ్చి ప్రేమో ఒక్క తన మనసుకి తప్ప మరొక మానవమాత్రుడికి తెలియదు. ఈ మనసుకి బుద్ధిలేదు. ఎటో వెళ్ళి పోతుంది! భవాని ఇదంతా తన మనసులో దాచుకొని పైకి మాత్రం నవ్వుతూ ముఖర్జీ మీద లేనిపోనివి చెప్పి తన అక్కసంతా తీర్చుకుంటుంది. ఎందుకంటే తన ప్రేమ వన్‌వే ట్రాఫిక్ కాబట్టి!



టాక్సీ దిగి సోనా బజారు మెట్రోస్టేషన్‌కి చేరుకుంది భవాని. మెట్రో ట్రైన్‌లో న్యూ మార్కెట్‌కి వెళ్ళి అక్కడ ఏవో పర్చేజస్ పూర్తి చేసుకుని డైరెక్ట్‌గా టాక్సీ చేయించుకుని సాల్ట్ లేక్‌కి వచ్చేసింది.

ఇంటికిరాగానే ఎదురు ఫ్లాట్‌లోవున్న సునీత దగ్గరకి పరుగులాంటి నడకతో వెళ్ళింది.

"ఒక యింపార్టెంట్ న్యూస్ సునీతా!" అంది ఒగరుస్తూ.

"ఏంటి మీవారికి ప్రమోషన్ వచ్చిందా?"

"ఛ. అదేంకాదు."

"మరి....?" సునీత ఆమె చెవిదగ్గర తననోరు పెట్టి గుసగుసగా అంది, "నువ్వు మళ్ళీ ప్రెగ్నెంటా?" అని.

"ఛ.ఛ. అలాంటిదేం లేదులే," అంది నిరాసక్తంగా.

"మరేమిటి?"

"మన ముఖర్జీ... అమ్మాయిలతో తిరుగుతున్నాడు! తెలుసా?" రహస్యం చెప్తున్నంత మెల్లగా అంది. సునీత తెల్లబోయింది.

'మన' ముఖర్జీ ఏమిటో ఆమెకే తెలియాలి.

ఇంతలో అలేఖ్య వచ్చింది చేతిలో పుస్తకంతో మమ్మీ!" అంటూ

అలేఖ్య భవాని కూతురు. తొమ్మిదేళ్ళది.

ఈ యింగ్లీష్ లెసన్ అర్థం కావడంలేదు. చెప్పు మమ్మీ!" అంటూ పుస్తకం ఆమెచేతికి యివ్వ బోతుంటే ఒక్క కసురు కసిరింది కూతుర్ని.

"ముఖ్యమైన విషయం మాట్లాడ్డానికొచ్చాను. అబ్బ ఎక్కడా నన్నెవరితోనూ మాట్లాడనివ్వవే." విసుక్కుంది భవాని.

"రాత్రి డాడీ రాగానే చెప్పేస్తాను. నువ్వు నాకు పాఠాలు చెప్పటం లేదని..." తుర్రుమంది అక్కడ్నుంచి.

"ఇది నిజంగా అన్నంత పనీ చేస్తుంది. అమ్మో, నే వెళ్తాను. అది పడుకున్న తర్వాత మళ్ళీ వస్తాను."

భవాని యింటికి వచ్చి వంట చేసింది.

రాత్రి తొమ్మిదిన్నరకి శ్రీనివాస్ వచ్చాడు. అప్పటికే అలేఖ్య పడుకుంది. ఇద్దరు భోజనాలు చేసారు. తర్వాత శ్రీనివాస్ టి.వి. చూస్తూ కూర్చున్నాడు.

అప్పటికి రాత్రి పది దాటింది. భార్యని

ఆకట్టుకోవడం అతనికి తెలియదు. నిజంగా బుద్ధావతారం. అతని మాటలు చప్పగా పేలవంగా వుంటాయి! అందుకే భవానికి భర్తతో మాట్లాడ్డం అంటే చేదు తిన్నట్టుగా ముఖం పెడుతుంది. భవాని కూడా టి.వి. చూస్తున్నది. ఇంతలో మోటర్‌సైకిల్ శబ్దం వినిపించింది. భవాని మనసు, చెవులు, కళ్ళు అటే వున్నాయి. వాళ్ళకిటికి దగ్గర కామన్ వరండా వుంది. అక్కడ బైక్ పెట్టి మేడ మీదకి వెళ్లాలి ముఖర్జీ. ఏదోపని వున్నట్టుగా గబగబా వీధిలోకి వచ్చింది. ముఖర్జీని చూసి అతను తనవైపు చూడాలని కొంతసేపు నుంచుని, ఎప్పటికీ అతను చూడకపోతే మళ్ళీ లోపలికి వచ్చేసింది.

వంటింట్లో పనిచేస్తున్నా ఆమె ఆలోచనలు ముఖర్జీ చుట్టూ తిరుగుతున్నాయి!

ముఖర్జీ యింతసేపు ఎక్కడవుండి వుంటాడు? అప్పట్నుంచి యిప్పటిదాకా ఆ అమ్మాయితోనే తిరుగుతున్నాడా?! సినిమాకి తీసుకెళ్లివుంటాడేమో?

మనీషాకోయిరాలా, అమీర్‌ఖాన్‌ల "మన్" రిలీజయింది కదా. దానికి వెళ్లిపోయివుంటారు. బ్యాక్‌సీట్లో కూర్చుని వుంటారు! ఆ తర్వాత....

అవును.... ముఖర్జీ ఈ కలకత్తాలో ఏ రెడ్‌లైట్ ఏరియాకో వెళ్లిపోతున్నాడేమిటి కొంపతీసి! ఆ ఆలోచన అంతగా రుచించలేదు ఆమె మనసుకి! నో. ముఖర్జీ హెల్త్ పాపం పాడయిపోదూ! ఆరడుగుల అందగాడు... ఎయిడ్స్ వచ్చిందంటే... హమ్మో! వద్దు, వద్దు. ముఖర్జీకి ఎవరిచేతనైనా చెప్పించాలి. లేదా తనే స్వయంగా చెప్పాలి!.. పిచ్చి పిచ్చి ఆలోచనలు అలా సాగిపోతూనేవున్నాయి!...

★ ★ ★

భవాని రోజూ సునీత దగ్గరకి వచ్చి ముఖర్జీ గురించి ఏదో ఒకటి చెప్తూనే వుంటుంది. ఆమె ద్వారా సునీతకి తెల్సిన విషయాలు... "ముఖర్జీకి జాబ్ వచ్చేక యిప్పుడు బాగానే వున్నారు. కాని, వాళ్లకి మొదట డబ్బు చాలేదికాదట. ఎంతో కష్టపడి కొడుకుని చదివించారట. ఇప్పుడు ముఖర్జీ పెద్ద ఆఫీసరయాడు. కానీ, తన కెంతజీతమో యింట్లో చెప్పడట. తన జీతమంతా గర్ల్‌ఫ్రెండ్స్ కోసం ఖర్చు పెట్టేస్తాడుట. రోజూ రాత్రుళ్ళు పది దాటాక వస్తాడట! పాపం ముఖర్జీ చెడిపోతున్నాడట. అతన్ని పట్టించుకొనేవాళ్లే లేరట. (వాళ్ల అమ్మ- నాన్నలున్నారు!)

భవానీ, సునీతతో చెప్పినట్టే యింటికి వచ్చిన వాళ్లతో, తెల్సినవాళ్లతో, పనిమనిషితో, ఆఖరికి సెక్యూరిటీ గార్డ్స్‌తో కూడా అవే విషయాలు పదేపదే చెప్తున్నది భవాని!

ముఖర్జీ మోటర్‌సైకిల్ శబ్దం వినబడతేచాలు నాగస్వరం విన్న నాగుపాములా మంత్రించినట్టుగా తను చేస్తున్న పన్లు ఆపేసి కిటికీ దగ్గరకొచ్చి చూస్తుంది. అక్కడే తచ్చాడుతుంది. ముఖర్జీ వేసే ప్రతి అడుగూ లెక్కపెడుతుంది. ముఖర్జీ మీద తనకి సర్వ హక్కులు వున్నట్లుగా మాట్లాడుతుంది. అయితే ముఖర్జీ చెడ్డవాడని, అమ్మాయిలతో తిరుగుతాడని నిరూపించడానికి ఎందుకన్ని తంటాలు పడుతోంది? ఎంత ఆలోచించినా సునీత బుర్రకెక్కడంలేదు...

రోజూ ఈ విషయం తన భర్తని అడుగుదామని వీలుచిక్కక వూరుకుంది. అరవింద్, ముఖర్జీ చాలా క్లోజ్‌గా వుంటారు. ఒకే ఆఫీసుఅవడం వలన శలవురోజుల్లోస్తే యిద్దరూ గంటలతరబడి మాట్లాడు కుంటూవుంటారు! ఒక రోజు మాటల మధ్యలో భర్తతో ముఖర్జీ విషయం ఎత్తింది.

"ముఖర్జీ నిజంగా దుర్మార్గుడా? అమ్మాయి లంటే పడిఛస్తాడా?"

"ఎవరు చెప్పారు నీకు?" అరవింద్ చపాతీలు తింటున్నవాడల్లా తలెత్తి ఆశ్చర్యంగా చూసాడు సునీతవైపు. భవాని, ముఖర్జీ గురించి చెప్పిన విషయాలన్నీ చెప్పేసింది.

" అలా చెప్పిందా! నేననుకుంటూనే వున్నాను. భవాని అలా ప్రచారం చేస్తుందని! నేను వూహించి నట్టే జరిగింది.

"ఏమయిందండి?" అర్థంకాలేదు సునీతకి.

"నామాటలమీద నీకు నమ్మకముందా?"


"అయ్యో! అదేంటండీ అలా అంటారు! మీరె లాంటివారో నాకు తెలీదా?"

"అయితే విను. భవానీ చెప్పినవన్నీ అబద్ధాలు, కట్టు కథలు. మీరంతా అనుకుంటున్నట్టు ముఖర్జీ చెడ్డవాడుకాదు. చాలా మంచివాడు. చెల్లెలి పెళ్లికని కట్నం డబ్బు యిప్పట్నుంచే బాంకులో వేస్తున్నాడు. లేక్ మార్కెట్ వెనక కొత్తగా కడ్తున్న ఫ్లాట్ ఒకటి బుక్ చేసాడు. తల్లి దండ్రులంటే చాలా గౌరవం. ఆ రోజు ముఖర్జీ మోటర్ బైక్ వెనక కూర్చున్నది ఎవరో కాదు. వాళ్ల పిన్ని కూతురు. వాళ్లు బెంగాలి వాళ్లు. ఈ కలకత్తాలో వాళ్లకి చాలా మంది రిలేటివ్స్ వుండడం నేచురల్. ఆరోజు వాళ్ల పిన్ని కూతురు కాలేజి దగ్గర డ్రాప్ చెయ్యమంటే ఎక్కించుకున్నాడు. మరొక విషయం వాడు మార్కెటింగ్ సైడు వున్నాడు. ఎప్పుడూ టూర్లు వుంటాయి. మిడ్నాపూర్, బర్ధ్వంపూర్, పాట్నా, అగర్తల, బర్‌ద్వాన్ అన్నీ వెళ్తూవుండాలి.

"మరి... భవాని... చెప్పినవన్నీ...."

"భవానీ... బుద్ధి మంచిదికాదు సునీతా! నేను మేగ్నిపై చెయ్యడంలేదు. జరిగిన సంఘటనలు కొన్ని చెప్తే నాకే తెలుస్తుంది. ఆమె బుద్ధి ఎలాంటిదో?! భవాని భర్త ఎలా వుంటాడో నీకు తెలుసుకదా. భవానీ కంటే పొట్టిగా, నల్లగా, సన్నగా వుంటాడు. పైగా బట్టతల! వాళ్లిద్దరికీ ఏజ్ డిఫరెన్స్ కూడా బాగా వుంది. అయితే యిక్కడ నమ్మలేని నిజం ఏమిటంటే భవానికి ముఖర్జీ అంటే చాలా యిష్టం. వాడంటే పడిఛస్తుంది. ముఖర్జీ తనతో మాట్లాడాలని, తనయింటికి ఏదో పని గట్టుకుని పది సార్లు రావాలని కోరుకుంటుంది. ఒకసారి భవాని, టీ తాగడానికి రమ్మని ముఖర్జీని వాళ్లింటికి పిల్చింది. అదీను భర్త యింట్లో లేనప్పుడు. ముఖర్జీ వెళ్లలేదు. అదీ కోపం! ఒక రోజు సడన్‌గా

## షూటింగ్‌లలో వంటచేస్తున్న అక్షయ్



అక్షయ్‌కుమార్ 'హేరా ఫేరీ' అనే సినిమా షూటింగ్‌లో యూనిట్ సభ్యులకు రెండు మూడుసార్లు ఎంతో ఉత్సాహంగా వంట చేసి పెట్టాడుట. ఇలాంటి ఉత్సాహం నటనలో చూపిస్తే అక్షయ్ నెం.1 హీరో అవుతాడని అంటున్నారు యూనిట్ సభ్యులు. ఆ విషయం పాపం అక్షయ్‌కి తెలియదేమో! సినిమాలు లేక పోతే కనీసం వంటవాడిగానైనా బతకవచ్చు అని వచ్చిన విద్యను మర్చిపోకుండా అప్పుడప్పుడూ ఇలా వంటచేస్తూ ఉంటాడేమో అక్షయ్.

పెద్ద వర్షం పడింది. ముఖర్జీ రెయిన్ కోటు తీసుకెళ్లలేదు. హెల్మెట్ పెట్టుకోలేదు. పాపం పూర్తిగా తడసిపోయాడు. అల్లంత దూరం నుంచే చూసేసి టవల్‌తో అతని తలని గబగబా తుడిచేసి లోపలికి రమ్మందట. అయినా ముఖర్జీ వెళ్లలేదు. వెంటనే అతని బుగ్గ మీద ముద్దు పెట్టుకుని వూహించని విధంగా "ఐ లవ్ యూ" అందంట. ముఖర్జీ షాక్ తగిలినట్టుగా అలా వుండిపోయాడు. అప్పట్నుంచి ముఖర్జీ ఆమెని తప్పించుకుని తిరగడం మొదలుపెట్టాడు! ముఖర్జీ పక్కా జంటిల్‌మాన్ తెలుసా! అలాంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా వుంటాడు.

ఒక పెళ్లయిన ఆడది, భర్త, పిల్లలు వుండగా పరపురుషుడ్ని వాంఛించడం మన సంప్రదాయినికి విరుద్ధంగా తప్పటడుగులు వేస్తున్నారు! భర్త వల్ల అసంతృప్తి వున్న ప్రతి ఆడది అలా చెయ్యదు! ముఖర్జీ పట్ల పిచ్చి ఆకర్షణ, భర్త పట్ల విముఖత, సాంసారిక జీవితంలో అతనివల్ల ఆమెకి అసంతృప్తి... వీటన్నిటి మధ్య ఆమె నలిగిపోతోంది. ఫలితంగా ముఖర్జీ మీద లేనిపోనివి చెప్పి దుష్ప్రచారం చేస్తూ అదొకరకమైన పైశాచికా నందాన్ని పొందుతోందామె! ముఖర్జీ గ్రీన్ సిగ్నల్ యిచ్చివుంటే భవాని సామాజిక కట్టుబాట్లు కూడా లక్ష్యపెట్టేదికాదు! ఆమె బుద్ధి అలాంటిది! పైగా ఎవరైనా నిలదీసి. అడిగితే భవానిలాంటివాళ్లు "ఏం! పెళ్లయిన ఆడది జీవితంలో ఎప్పుడూ ఎవర్నీ ప్రేమించకూడదనే రూలేదయినా వుందా? ప్రేమించడానికి వయసుతో, కాలంతో నిమిత్తం లేదు. ఆమెకి ప్రేమించేహక్కు వుంది." అని అడ్డంగా వాదిస్తారు! భవానిలాంటి స్త్రీలు, పెళ్లయిన తర్వాత కూడా భర్త అతి మంచితనాన్ని అసరాగా తీసుకుని "ప్రేమ" పేరుతో పర పురుషుడికి దగ్గరవ్వాలని కోరుకుంటారు! ఒక్క స్త్రీలే కాదు, మగాళ్లు కూడా కొంతమంది అలాంటి వాళ్లున్నారు. పెళ్లాయిక కూడా మరొక అమ్మాయితో స్నేహం చెయ్యడం, తనకింకా పెళ్లి కాలేదని అబద్ధం ఆడ్డం, తద్వారా ఆపదలుకొని తెచ్చుకోవడం, సంసారంలో సమస్యలు తెచ్చుకోవడం ఈ రోజుల్లో పిచ్చి ఫాషనయిపోయింది!..." ఆవేశంగా చెప్పుకు పోతున్నాడు అరవింద్.

"సరేలేండి, వాళ్ల గొడవ మనకెందుకు! వేడివేడి టీ తాగండి." అంటూ టీ ఫ్లాస్క్‌లోంచి తీసి కప్‌లో పోసి యిచ్చింది సునీత...

శ్రీనివాస్‌కి సడన్‌గా హైద్రాబాద్ ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. అందరూ ఆశ్చర్యపోయారు. మరో వారం రోజుల్లో ఫామిలిని తీసుకువెళ్లిపోతాడని తెల్సింది! పైకి ఏం ఎరగనట్టు వుంటాడు కాని, జరుగుతున్న విషయాలన్నీ శ్రీనివాస్‌కి తెలుసని, భార్య 'బుద్ధి' కూడా అతనికి బాగా తెలుసనీ, అందుకే అతను కావాలనే అలా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడని అక్కడ ఎవరికీ తెలీదు! ❋



## హీరోలను దేవుడిలా చూస్తారు

టబూ తనకు ఏ దర్శకుడైనా, నిర్మాతైనా హీరోల డేట్స్‌కు అనుగుణంగా డేట్స్ ఇవ్వమని అడిగితే కోపం వస్తుందని అంటోంది. బాలీవుడ్ హీరోలను దేవుడిలా చూస్తారు అని నిర్మాతల, దర్శకులమీద మండిపడుతోంది. బాలీవుడ్‌లో హీరోలను కాకాపడితేగానీ సినిమాలు రావనే విషయం ఆమెకు తెలియదేమో!

# షూస్ కొనేముందు....

సరైన పాదరక్షలు ధరించకపోతే భవిష్యత్తులో అనేక రకాల పాదాల సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. కనుక ఇకనుంచి చెప్పులు కొనేముందు ఈ కింద చెప్పినవి గుర్తుంచుకోండి.

✤ పాదరక్షలు ఎప్పుడూ సాయంత్రం పూట కొనుక్కోవాలి.

✤ మీకు ఏవైనా చెప్పులు నచ్చగానే ప్యాక్ చేయమనకండి. నిలబడి వాటిని ధరించి అటుఇటు నడిచి చూసుకోండి.

✤ చెప్పుల అందం కన్నా సౌకర్యానికి ఎక్కువ ప్రాముఖ్యత నివ్వండి.

✤ చెప్పులు మరీ గట్టిగా ఉంటే వాటిజోలికి వెళ్ళకండి. దీనివల్ల పాదాల సమస్యలు అనేకం ఎదుర్కోవాల్సి వస్తుంది.

✤ మరీ బిగుతుగా కానీ, వదులుగా కానీ ఉంటే చెప్పులు కొనకూడదు.

✤ కొందమందిలో పాదాల సైజులో తేడా వుంటుంది. ఒకటి పొడవు మరొకటి కొంచెం పొట్టిగా ఉంటాయి. ఈ తేడా చెప్పులు ధరించేప్పుడే తెలుస్తుంది. కాబట్టి ఇలాంటివారు కొంచెం పెద్ద సైజు కొనుక్కోవాలి.



✤ పార్టీ వేర్ కోసమయితే హీల్ ఉన్నా ఫర్వాలేదు కాని రోజువారి వాడకినికి ఫ్లాట్‌షూస్ కొనుక్కో వడమే బెటర్. ఒకవేళ హీల్ వాడదలిచినా ఒకటి లేదా ఒకటిన్నర అడుగులు మించి హీల్ కొనకండి. మరీ ఎత్తుమడమలున్న చెప్పుల వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి.

✤ షాపువారు మీ పాదాలు చూసి ఫలానా నెంబర్ సరిపోతుందంటే వాటిని ప్యాక్ చేసేయమన కూడదు. వాటిని వేసుకుని అటు ఇటు నడిచాక సౌకర్యంగా అనిపిస్తేనే ప్యాక్ చేయించుకోవాలి. ఎందుకంటే ఈ నెంబర్లు షాపు షాపుకీ మారిపోతుంటాయి.

-అట్లు అమృతలక్ష్మి